క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఈఓ

మహానంది: మహానందిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ కలెక్టర్ రాజకుమారి గణియాకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆహ్వాన పత్రిక అందించారు. శనివారం ఈఓ శ్రీనివాసరెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించారు. మహానందిలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ నెల 18న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో రెండో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి ఈఓ తీసుకెళ్లారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

● డీఎస్పీ రామాంజి నాయక్



గ్రామసభలో ప్రసంగిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరురూరల్: సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. మండల పరిధిలోని కరివేన గ్రామంలో శనివారం రాత్రి జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సెల్‌ఫోన్‌లలో వచ్చే మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. ఇతరులెవరికీ ఓటీపీలు పంపరాదన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మైనర్‌లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. మతసంబంధమైన విషయాల పట్ల సున్నితంగా వ్యవహవరించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్ సీఐ రాము పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలి



ఎంఈఓ-2 ఇనాయతుల్లాకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గోకవరం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని పూర్వ విద్యార్థుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణాచారి శనివారం ఎంఈఓ-2 ఇనాయతుల్లాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సేవా సమితి ట్రెజరర్ వెంకటరమణ, చైర్మన్ సోమేశ్వరయ్య, ఉపాధ్యాయులు జె వెంకటస్వామి, వెంకటాద్రి పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి స్థల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

కొత్తపల్లి: మండలంలోని శివపురం చెంచుగూడెంలో ఏర్పాటు చేయనున్న ఆరోగ్య ఉపకేంద్రానికి ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్(పీవీటీజీ) మిషన్ నుంచి కన్జర్వేషన్ కమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీసీడీపీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్ సెంటర్‌కు రూ.55 లక్షలు మంజూరు చేసిందన్నారు. సబ్ సెంటర్‌కు కావలసిన స్థలాన్ని పరిశీలించామన్నారు. దాతలు ఎవరైనా ఉంటే చెంచుగూడెం సమీపంలో స్థలాన్ని ఇవ్వాలని కోరారు. అనంతరం శివపురం గ్రామ శివారులోని పెట్రోల్ బంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న ఉన్నారు.

విద్యుత్ స్తంభాలను సరిచేయండి

నందికొట్కూరు: మూడు నెలలు గడవకముందే ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కన్వీనర్ లాజరస్ కోరారు. శనివారం బ్రాహ్మణకొట్కూరు గ్రామ సమీపంలో నేషనల్ హైవే పక్కన్న ఒరిగిన విద్యుత్ స్తంభాలను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరితో విద్యుత్ స్తంభాలు ఏర్పాట్లు చేయడంతో కొన్ని రోజులకే ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. జిల్లా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

బుక్‌పోస్ట్ సర్వీసుల రుసుం పెంపు పుస్తక ప్రియుల పాలిట శరాఘాతమైంది. ఈ సర్వీసుకు మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనీ ఆర్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలా శాఖ బుక్‌పోస్ట్‌పై భారీగా షాక్ ఇచ్చింది. దీంతో వార, పక్ష, ఆధ్యాత్మిక పుస్తకాల బట్వాడాపై ధరల మంట మండింది.



తపాలా బాదుడు షురూ

● పోస్టల్ చార్జీలు భారీగా పెంపు
● పుస్తక ప్రియులపై పిడుగు

నంద్యాల(న్యూటౌన్): బుక్ పోస్ట్ సర్వీసు పేరుతో ఇంత కాలం అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్ పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్‌పోస్ట్‌ను బుక్ పోస్టుగా మార్చి సేవల చార్జీ పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్ట్ కార్డులను ఒకే విభాగం కిందకు తెచ్చారు. రిజిస్టర్ బుక్ పోస్ట్ కాలమును గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి రహస్యంగా తొలగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడాపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ప్రైవేట్ సేవలతో పోలిస్తే..

ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఇప్పటి వరకూ తపాలా శాఖ తక్కువ ధరలతో తరలింపు సేవలు అందిస్తోంది. కానీ నూతన కఠిన నిర్ణయాలతో ప్రైవేట్ కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్ గతంలో రూ.80 చెల్లించే వారని, ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్టర్ బుక్‌పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాలా శాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పార్శిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా పోస్ట్‌లో తెప్పించుకోవాలంటే రూ.80 పోస్టల్ చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునే వారెవరుంటారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

దిగుమతి సుంకంపై ఆందోళన

శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి విధించడం సమర్థనీయమే అయినా.. కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం దుర్మార్గమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బుక్‌పోస్ట్ బరువు	పాత ధర	కొత్త ధర
100గ్రాములు	రూ.22	రూ.28
1 కేజీ	రూ.27	రూ.92
2 కేజీలు	రూ.43.50	రూ.163
3 కేజీలు	రూ.56.40	రూ.234
4 కేజీలు	రూ.67	రూ.304
5 కేజీలు	రూ.79	రూ.365

పుస్తకాలకు దూరం చేయడమే



కేంద్రం తీసుకున్న కొత్త నిర్ణయంతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి ఇలా చేయడం సరికాదు. ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు, తెప్పించుకు నేదెవరు. ఇప్పటికైన కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
– అన్నెం శ్రీనివాసరెడ్డి, రచయిత, నంద్యాల

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

పాములపాడు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వృక్షశాస్త్రం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 13 మంది, ఏపీ మోడల్ కళాశాల విద్యార్థులు 30 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఉదయం మొదటి బ్యాచ్ 20 మంది, మధ్యాహ్నం రెండవ బ్యాచ్ 23 మంది విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించారు.

మిడుతూరు: స్థానిక ఇంటర్మీడియెట్ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఫిజిక్స్ అధ్యాపకులు ఎల్లన్న తెలిపారు. ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ప్రాక్టికల్స్ పరీక్షలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం నిర్వహించిన బోటనీ ప్రాక్టికల్స్‌కు ఉదయం 20 మంది, మధ్యాహ్నం 20 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ శంకర ఆచారి, బోటనీ సీనియర్ అధ్యాపకులు సీతారామారాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మహానంది: మహారాష్ట్రలోని లాతూర్ పట్టణానికి చెందిన వైష్ణవిరెడ్డి, కుటుంబ సభ్యులు శనివారం మహానందికి వచ్చారు. స్థానిక సుపథ మండపం వద్ద సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. స్థానికుడు అల్లూరయ్య ఫోన్ గుర్తించి సమాచారం కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మధుకు అప్పగించారు. మైకుల్లో మధు అనౌన్స్ చేయడంతో వారు అక్కడికి చేరుకోగా తిరిగి అప్పగించారు.

వైభవంగా సేవాలాల్ జయంతి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బంజారాలు



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు

వెలుగోడు: పట్టణంలోని జమ్మి నగర్ తండాలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని వైభవంగా నిర్వహించుకున్నారు. సేవాలాల్, మారెమ్మ ఆలయంలో బంజారాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మహా భోగ్ కార్యక్రమం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక బంజారా నాయకులు కొల్యా నగేష్ నాయక్, బద్దే నాయక్, వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త, సంఘ సేవకులు, బంజారాల జాతిపిత, ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్, రమేష్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ దేశవ్యాప్తంగా బంజారాలను చైతన్యపరుస్తూ తండాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంబాలాజీనాయక్, హనుమానాయక్, వెంకటేశ్వర్లునాయక్, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

ఆత్మకూరు రూరల్: మార్చి 8న జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పోలీస్ అధికారులకు, న్యాయవాదులకు సూచించారు. శనివారం ఆయన కోర్టుల సముదాయంలో ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లె పోలీస్ స్టేషన్ల పోలీసు అధికారులు, న్యాయవాదులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాజీ కాదగిన కేసుల్లోని ఇరు వర్గాలను కలిసి అవగాహన కల్పించి జాతీయ మెగా లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు.

ఇద్దరు యువకులకు గాయాలు

మహానంది: బోయిలకుంట్ల నుంచి ఇద్దరు యువకులు బైకుపై వస్తుండగా కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయాలయ్యాయి. బోయిలకుంట్లకు చెందిన హరి, రాజాలు బైకు మీద వస్తుండగా కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు.

మహానందిలో పెళ్లిసందడి



మహానందిలో వివాహం చేసుకుంటున్న వధూవరులు

మహానంది: మహానందిలో శనివారం పెళ్లిళ్ల సందడి నెలకొంది. మాఘమాసం కావడంతో మంచి ముహూర్తాలు ఉండటంతో పలు ప్రాంతాల వధూవరులు మహానందీశ్వరుడి సన్నిధిలో వివాహాలు చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. మహానందిలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఓ వివాహానికి అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించారు.

గడ్డివాము దగ్ధం

మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన రైతు శేషన్న తన కల్లంలో ఏర్పాటు చేసుకున్న గడ్డివాము శనివారం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. శేషన్న తన కల్లంలో పశువుల కోసం గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. సమీపంలోని పొలం దండను కాల్చడంతో గడ్డివాముకు నిప్పంటుకుంది. దీంతో రైతు శేషన్నకు నష్టం వాటిల్లింది.

బాలికల వసతి గృహం తనిఖీ

పాములపాడు: స్థానిక బాలికల వసతి గృహాన్ని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి రాజు తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్ అందజేశారు. ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థితిలో ఉండేందుకు చదువు ఆయుధం అని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం హాస్టల్ మెయింటెనెన్స్ నిధులచే చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, హెచ్‌డబ్ల్యూ అనిత, పంచాయతీ కార్యదర్శి నాగశేషులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి పాస్ కావాలి

● డీఈఓ జనార్దన్‌రెడ్డి



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

శిరివెళ్ల: పదో తరగతి పరీక్షలలో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా బోధన చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, వీరారెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. వంద రోజుల ప్రణాళిక అమలుపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది మాదిరిగా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీబీవీ ప్రిన్సిపాల్ జ్యోత్స్నకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. వీరారెడ్డిపల్లెకు చేరుకొని అక్కడ స్టడీ అవర్‌ను పరిశీలించారు. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని హెచ్‌ఎం మధురవాణికి సూచించారు.

మండల అభివృద్ధే లక్ష్యం

● ఎంపీపీ తిరుపాలమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపాలమ్మ

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమని ఎంపీపీ తిరుపాలమ్మ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు రహదారుల ఏర్పాటుకు, వీధిదీపాలు, తాగునీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మండలాధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఏ గ్రామంలో నీటి సమస్య ఉన్నా తమదృష్టికి లేదా ఎంపీడీఓ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ నాగభూషణంశెట్టి మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా నాగలూటి, పెచ్చెరువు, చెంచుగూడేల్లో భక్తులకు నీటి ఎద్దడి లేకుండా బోర్లకు మరమ్మతులు చేపట్టామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్ ఏఈ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఆత్మకూరు మండలంలో రూ.3.75 కోట్లు, శ్రీశైలం మండలంలో రూ.3 కోట్లతో అన్ని గ్రామాల్లో నూతన సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కష్టప్రసాద్ మాట్లాడుతూ వెలుగోడు నుంచి గుండ్లబ్రహ్మేశ్వర క్షేత్రానికి రహదారి ఉందని, భక్తులు వెలుగోడు నుంచి వెళ్లేందుకు నంద్యాల ఫారెస్టు అధికారులు అనుమతులు ఇవ్వాలని చెప్పారు. రుద్రకోడూరు పుణ్యక్షేత్రానికి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు వెళ్తారని, వారికి శివరాత్రి సందర్భంగా వెళ్లే వాహనాలకు ఎలాంటి రుసుము వసూలు చేయమని, శివరాత్రి అనంతరం ఈ క్షేత్రానికి వెళ్లే భక్తుల వాహనాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రుసుము వసూలు చేస్తామని చెప్పారు. ఇందిరేశ్వరం గుమ్మితం క్షేత్రానికి వెళ్లాలంటే ఆత్మకూరు డీఎఫ్‌ఓ అనుమతి తీసుకోవాలన్నారు. శ్రీశైలం మహాక్షేత్రానికి కాలినడకన వెళ్లే భక్తులు తప్పనిసరిగా వెంకటాపురం నుంచే వెళ్లాలని, బైర్లూటీ, నాగలూటి మీదుగా వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం నాగమ్మ, మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్

● ఎమ్మెల్యే జయసూర్య



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ నిర్వహిస్తునట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. శనివారం జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయా సమస్యలపై వచ్చినా అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పరిష్కారం చేసే దిశగా అధికారులు అడుగులు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, బాలన్న, పెద్దన్న, రవికుమార్, బాబు, సుధాకర్, మోహన్‌రెడ్డి, రాముడు, శేఖర్, రవికాంత్, మన్సూర్, స్వామన్న, అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న సీఐ రాము

ఆత్మకూరు: పట్టణంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సీఐ రాము శనివారం తెలిపారు. నేరాల నివారణకు, నిందిలు గుర్తింపునకు సీసీ కెమెరాలు పోలీసులకు బాగా ఉపయోగపడతాయన్నారు. గౌడ్ సెంటర్, బస్టాండు, నంద్యాల టర్నింగ్ పాయింట్, పెద్ద మాస్క్, అంబేడ్కర్ విగ్రహం, సంగమేశ్వర సర్కిల్, ఓల్డ్ బస్టాండ్, కిషన్ సింగ్ వీధి, చరకా కాలనీ, అమ్మవారిశాల, సాయిబాబా గుడి రోడ్డు, వెంగల్‌రెడ్డి నగర్, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలిక వసతిగృహం, జగనన్న కాలనీ, ఫారెస్టు చెక్‌పోస్టు కరివేనా, నల్లకాల్వ, స్మృతివనంల వద్ద మొత్తం 80 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మూడో రోజు కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన



పాలమర్రిలో ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: నీటి ముంపు నిర్వాసితులైన అవార్డుదారులకు పరిహారం అందించేందుకు శ్రీశైలం ప్రాజెక్ట్ అధికారులు చేపట్టిన ధ్రుపత్రాల పరిశీలన మూడో రోజు కొనసాగింది. శనివారం ముచ్చుమర్రి, ఎల్లాల, పగిడ్యాల, పాలమర్రి గ్రామాల్లో క్యాంప్‌లు ఏర్పాటు చేసి అవార్డుదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తహసీల్దార్ విజయుడు మాట్లాడుతూ జీవించి ఉన్న అవార్డుదారులు ఆధార్ కార్డు, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటో ఒకటి, అవార్డు కాపీ, బ్యాంక్ బుక్ జిరాక్స్‌లను అందజేయాలన్నారు. అవార్డుదారులు మరణించి ఉంటే వారి రక్తసంబంధీకులు పరిహారం తీసుకోవడం కోసం అవార్డుదారుని మరణ సర్టిఫికెట్స్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్, ఎన్‌ఓసీ, సొంత అఫిడవిట్, ఆధార్, బ్యాంక్ బుక్, ఫొటోలు అందజేయాలని సూచించారు. ఈ నాలుగు గ్రామాల్లో 183 మంది అవార్డుదారులు ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వచ్చే నెల 4న కర్నూలు జిల్లా కోర్టులో పరిహారం చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. సోమవారం ప్రాతకోట గ్రామంలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 4 డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో నాగన్న, తిక్కస్వామి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఆత్మకూరులో క్రీడాకారులతో కలిసి చెత్తను ఊడ్చుతున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు



నందికొట్కూర్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న కమిషనర్ బేబి, ఉద్యోగులు

ఆత్మకూరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు అన్నారు. శనివారం ఆత్మకూరులోని కేవీకే స్టేడియంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. క్రీడాకారులు, వాకింగ్‌కి వచ్చే వారితో కలిసి గ్రౌండ్‌లో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చెత్తను ఊడ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, ప్రభుత్వ పాఠశాల క్రీడా శిక్షకులు దేవానంద్, తైక్వాండో గౌరవాధ్యక్షులు నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● పాములపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాలను, అంగన్‌వాడీ స్కూళ్లలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమాల్లో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విమలమ్మ పాల్గొన్నారు.

● నందికొట్కూరు: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బేబి ప్రారంభించారు. కార్యాలయం ఎదుట రోడ్డుపై ఉన్న చెత్తను ఉద్యోగులతో కలిసి కమిషనర్ శుభ్రం చేశారు. విద్యార్థుల చేత స్వచ్ఛ నందికొట్కూరు అంటూ ప్రతిజ్ఞ చేయించారు.

● పగిడ్యాల: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా చేపట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఈఓఆర్డీ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● మిడుతూరు: సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి, సర్పంచ్ జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.

● శ్రీశైలంప్రాజెక్ట్: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ప్రాజెక్ట్ అధికారి కేవీ శివప్రసాద్, ఏపీఓ ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు దుద్యాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీ మేరీ, సర్పంచు లక్ష్మీదేవి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ పదార్థాలు చేయరాదన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బస్టాండు సెంటర్‌లోని గాంధీ విగ్రహ ముందు ప్రతిజ్ఞ చేశారు.

● బండి ఆత్మకూరు: మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్‌లో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

– వెలుగోడు: వెలుగోడు, బోయరేవుల గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

● మహానంది: మహానంది వ్యవసాయ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏడీ డాక్టర్ వీర జయలక్ష్మి, తదితరులు పాల్గొని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.